క్లుప్తంగా

గెడ్డగూడలో నీటి ఎద్దడి



నీటి కోసం చెలమ వద్దకు వెళ్తున్న గ్రామస్తుడు

కురుపాం: మండలంలోని తూర్పుముఠా ప్రాంతం గిరిశిఖర పంచాయతీ అయిన జరడ పరిధిలో ఉన్న గెడ్డగూడలో తీవ్ర నీటిఎద్దడి నెలకొంది. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ప్రారంభానికి ముందే గ్రామంలోని నీటి నిల్వలు అడుగంటి పోవడంతో సమీపంలో ఉన్న చెలమ నీటిని తెచ్చుకుంటున్నారు. గుక్కెడు నీటి కోసం చెలమల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామీణ తాగునీటి విభాగం, పంచాయతీ అధికారులు స్పందించి తమ గ్రామంలో దాహం కేకలు తీర్చాలని వారంతా కోరుతున్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి



ప్రచారం చేస్తున్న రమాప్రభ

పాలకొండ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీచేస్తున్న కొరెడ్ల రమాప్రభ సోమవారం నగరపంచాయతీలో ప్రచారం నిర్వహించారు. సీపీఎం అనుబంధ సంఘాలతో కలిసి పట్టణంలోని పట్టభద్ర ఓటర్ల వద్దకు వెళ్లి తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

పాలకొండ: వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలతో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్ రావు తెలిపారు. పార్టీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం నివాసం వద్ద జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు హాజరుకావాలని కోరారు.

ఏపీటీఎఫ్ నేతల ధర్నా



ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పాలకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. 11వ పీఆర్‌సీలో ఉన్న లోపాలు సవరించాలని, 12వ పీఆర్‌సీకి కమీషన్ వేయాలని, పాఠశాలల విలీనం నిలిపివేయాలని తదితర డిమాండ్లతో నినాదాలు చేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు వాసుదేవరావు, సంపత్‌కుమార్, బీవీ రమణ, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పైప్‌లైన్ పనులు



పైపులైను పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

పాలకొండ: పట్టణంలోని బాసూరువీధిలో తాగునీటి పైపులైన్ పనులు సోమవారం నిర్వహించారు. నాన్ అమృత పథకంలో భాగంగా తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. డీఈఈ కిరణ్ పనులను పర్యవేక్షించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట స్థానిక కౌన్సిలర్ బాసూరు కాంతారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు తదతరులు ఉన్నారు.

తల్లిదండ్రుల సమావేశం



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం లిల్లీరాణి

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి విద్యార్థుల ప్రోగ్రెస్‌ను వారి తల్లిదండ్రులకు వివరించారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్ల వ్యాధులపై అప్రమత్తం





డాక్టర్ ప్రభామాణిక్యరావు, పశుసంవర్ధకశాఖ ఏడీ

పాలకొండ రూరల్: ఇటీవల కోళ్లు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నాయి. ఉన్నట్టుండి పడిపోవడం, నడవలేక పోవడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. కోళ్లకు సంక్రమించే వ్యాధులపై పెంపకందారులు అవగాహన కలిగి ఉండాలని, ఎప్పటికప్పుడు టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు(ఏడీ) డాక్టర్ ప్రభామాణిక్యరావు సూచిస్తున్నారు.

నిర్ధారణ

బాహ్య,అంతర పరాన్నజీవుల కారణంగా వ్యాధులు సంక్రమిస్తాయి. చిన్నచిన్న కీటకాలను ఆహారంగా తీసుకునే కోళ్లలో కొన్నిరకాల అంతర పరాన్నజీవులు చేరి వ్యాధులకు కారణమవుతాయి. ముఖ్యంగా బద్దెపురుగు వంటి అంతర పరాన్నజీవుల కారణంగా కోళ్లలో పెరుగుదల లోపించడంతో పాటు కళ్లలో శక్తి క్షీణించి నడవడం కష్టంగా మారి, ఉన్నచోటే కోళ్లు పడిపోవడం జరుగుతుంది. వ్యాధి సోకిన కోళ్లలో పెరుగుదలతో పాటు గుడ్ల ఉత్పత్తి తగ్గిపోతుంది. కొన్నిసార్లు రక్తస్రావం జరిగి కోళ్లు చనిపోయే ప్రమాదం ఉంది. సకాలంలో వ్యాధి లక్షణాలను గుర్తించి కోళ్లకు టీకాలు వేయిస్తే వాటిని కాపాడుకోవచ్చని పశువైద్య సిబ్బంది సూచిస్తున్నారు.

నివారణ చర్యలు

వ్యాధి నిర్ధారణకు చనిపోయిన కోళ్లను పోస్టుమార్టం చేసినట్లయితే పేగుల్లో చిన్నచిన్న పురుగులు కనిపిస్తాయి. వైద్యుల సూచనల మేరకు పొట్ట పురుగు, బద్దె పురుగు నివారణకు పైపర్‌జిన్ ఎఫిపేట్, ప్రాజిక్వాంటల్, నిక్లోసమైడ్ వంటి మందులు నోటి ద్వారా అందించవచ్చు. కేజీ బరువున్న కోడికి వంద మిల్లీలీటర్ల నీటిలో కలిపి అందించాలి. ఆరు వారాల వయస్సు గల వెయ్యి కోళ్లకు 370 ఎం.ఎల్ మందును నీటిలో కలిపి అందించాలి. బ్యుటినోరేట్ 150 మిల్లీ గ్రాములు, డైక్లోరోఫెన్ 200 మిల్లీగ్రాములు కిలో దాణాలో కలిపి ఇవ్వాలి. లేదా మెబెండజోల్ పౌడర్ 100 కోళ్లకు 10 మిల్లీ గ్రాములు చొప్పున దాణాలో ఇవ్వడం లేదా ఫెన్‌బెండజోల్, ప్రాజిక్వాంటల్ వంటి మందులు వైద్యుల సూచనల మేరకు వాడాల్సి ఉంటుంది. కోళ్ల పెంపకందారులు అధిక లాభాలు ఆర్జించేందుకు వాటికి సోకే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి. వ్యాధులను ఆదిలోనే నివారించేందుకు డెల్టామైత్రీన్ అనే ద్రావాణాన్ని నీటిలో కలిపి కోళ్లఫారాల్లో పిచికారీ చేయాలని, లేదా పినాయిల్, సైథియాన్ వంటి క్రిమిసంహారక మందులు కోళ్లఫారాల చుట్టుపక్కల పిచికారీ చేయడం వలన కీటకాల వ్యాప్తి తగ్గి బద్దెపురుగుల నివారణకు అవకాశం ఉంటుంది.

190 మందికి కంటి పరీక్షలు



పాలకొండ రూరల్: కళ్లద్దాలు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం రవి, డాక్టర్ కృష్ణారావు

వీరఘట్టం: స్థానిక సత్యసాయి సేవా సమితిలో బడ్డుమాసంగికి చెందిన ప్రగతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో తిరుపతికి చెందిన నవజీవన్ ట్రస్ట్ ఆర్థిక సాయంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సొసైటీ అధ్యక్షుడు పైల హరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా 190 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. 90 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వారికి మంగళ, బుధవారాల్లో విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు వెల్లడించారు. కంటి పరీక్షలకు వచ్చిన వారందరికీ సత్యసాయి భక్తులు పులిహోరా అందజేశారు. కార్యక్రమంలో నవజీవన్ ట్రస్ట్ మేనేజర్ ఎస్.వి.రమణ, సత్యసాయి సమితి కన్వీనర్ వి.విశ్వప్రసాద్, గెంబలి మురళి, కిల్లారి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.



వీరఘట్టం: కంటి ఆపరేషన్ల కోసం విశాఖపట్నం వెళ్తున్న రోగులు

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

పాలకొండ రూరల్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పెద్దకాపువీధి, వీవర్స్‌కాలనీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 610 మందికి డాక్టర్ టి.కృష్ణారావు కంటి పరీక్షలు చేశారు. నేత్ర సమస్యలు ఉన్నవారికి మందులు, కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు జామి రవి, పరాంకుశం నాయుడు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

సీతంరాజుకు మద్దతుగా ప్రచారం



గరుగుబిల్లి: పెద్దూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయుకులు

గరుగుబిల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి, మరుపెంట, ఉల్లిభద్ర తదితర గ్రామాల్లో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. సీతంరాజును గెలిపించుకుని ముఖ్యమంత్రికి మద్దతు తెలియజేద్దామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు, కృష్ణమూర్తి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట: ప్రచారం చేస్తున్న ఎంపీపీ ఆదినారాయణ

సీతంపేట: ఉత్తరాంధ్రా పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో దిగిన సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎంపీపీ బి.ఆదినారాయణ కోరారు. సీతంపేటలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్ర ఓటర్లను కోరారు. ఆయనతో పాటు పార్టీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు, సర్పంచ్ ఎ.కళావతి, ఎంపీటీసీలు ఎస్.చంద్రశేఖర్‌రావు, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రెండెకరాల జీడితోట దగ్ధం

భామిని: మండలంలోని బాలేరు-లక్ష్మీపూర్ గ్రామాల మధ్య గల రెండు ఎకరాల జీడి, మామిడి తోట అగ్ని ప్రమాదానికి గురై కాలిపోయింది. బాలేరుకు చెందిన రైతు కాసిన కోటేశ్వరరావు తోటలో జీడిచెట్లతో పాటు, మామిడి, నీలగిరి, వెదురు చెట్లు ఆహుతయ్యాయి. పంటలు చేతికి వచ్చే తరుణంలో ప్రమాదం జరగడంతో సుమారు రెండు లక్షల రూపాయల తోటలు నష్టపోయామని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. రెండు రోజుల క్రితం రైతు కోటేశ్వరరావు తన సోదరుడి గృహప్రవేశానికి హైదరాబాద్ వెళ్లిన సమయంలో ప్రమాదం జరగడం అనుమానాలకు తావిస్తోంది.

పంటల సేకరణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఉద్యానవన శాఖాధికారి శ్రీనివాసరెడ్డి

పాచిపెంట: పంటల సేకరణ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో నిర్మిస్తున్న పంటల సేకరణ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు పండించిన పంటలను ఇక్కడ శుద్ధి చేసి అనంతరం రవాణా చేసుకోవచ్చన్నారు. ఇలాంటి కేంద్రాలు జిల్లాలో 21 నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటు మరో 10 కోల్డ్ స్టోరేజ్ భవనాలు కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈయన వెంట మండల ఉద్యానవనశాఖ అధికారి ప్రత్యూష ఉన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం: ఏపీ బాలయోగి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో ఐదవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ బాలురు 1.9.2010 నుంచి 31.8.2014 లోపు బీసీ, బీసీ-సి, ఓసీ బాలురు 1.9.2012 నుంచి 31.8.2014 లోపు జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. బాలురు ఇదే జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపుపొందిన పాఠశాలలో 20021-22విద్యా సంవత్సరంలో మూడో తరగతి, 2022-23లో నాలుగో తరగతి చదువు పూర్తి చేసి ఉండాలని, తల్లి, తండ్రి లేదా సంరక్షకుడి వార్షిక ఆదాయం లక్ష రూపాయలకు మించి ఉండకూడదని వివరించారు. అర్హులైన అభ్యర్థులు ఏపీజీపీ సెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా మార్చి 24లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆబ్జెక్టివ్ విధానంలో తెలుగు 10 మార్కులు, ఇంగ్లిష్ 10, గణిత 15, ఎన్విరాన్‌మెంట్ సైన్స్ 15, మొత్తం 50 మార్కు లకు పరీక్ష నిర్వహించి, మార్కుల ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసేందుకు సహాయం కోసం కార్యాలయంలో అన్ని పనిదినాల్లో సంప్రదించవచ్చని సూచించారు.

గిరిజన స్పందనకు 28 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన గిరిజన స్పందనకు మొత్తం 28 వినతులు అందాయి. ఐటీడీఏ పీఓ బి.నవ్య ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. టిటుకుపాయి గ్రామానికి విద్యుత్ స్తంభాలు వేయించాలని, మానాపురంలో సీసీరోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, పాండ్ర గ్రామానికి గ్రావిటేషన్ పథకం మంజూరు చేయాలని ఆయా గ్రామస్తులు అధికారులను కోరారు. ఇంటర్నెట్, జిరాక్స్ షాప్ పెట్టుకునేందుకు రుణం ఇప్పించాలని మాలువ గ్రామానికి చెందిన రవికుమార్, కుట్టు మిషన్ మంజూరు చేయాలని బూర్జగూడకు చెందిన అరిక మూర్తి, జీడిపిక్కల కొనుగోలుకు ఆర్థిక సాయం చేయాలని పులిగుమ్మికి చెందిన చిలకమ్మ స్పందనలో దరఖాస్తు చేశారు. డీసీసీ ద్వారా చేసిన పనులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని ముకుందాపురానికి చెందిన పాట్టేషు కోరారు. ఆరోగ్యం బాగోలేనందున ఆర్థిక సాయం చేయాలని జంతూరుకు చెందిన బెవర సోమేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ రంగలక్ష్మి, గురుకులం సెల్ ఇన్‌ఛార్జ్ వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకాబ్, పీఏఓ హరికృష్ణ పాల్గొన్నారు.



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ నవ్య



భామిని: తహసీల్దార్ అప్పారావుకు వినతిపత్రం ఇస్తున్న కళావతి



జియ్యమ్మవలస: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వేతనదారులు

ఉపాధి పనికల్పించాలని వినతి

జియ్యమ్మవలస: ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ రామినాయుడువలస గ్రామానికి చెందిన వేతనదారులు సోమవారం ఎంపీడీఓ ఎస్.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో మూడు వారాలుగా ఉపాధి పనులు కల్పించడం లేదని వాపోయారు. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించి పనులు కల్పిస్తామని ఎంపీడీఓ వారికి హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ రెడ్డి బలరాం స్వామినాయుడు, గుల్ల దాలినాయుడు, రెడ్డి వెంకటనాయుడు, వైకుంఠం మోహనరావుతో పాటు 60 మంది వేతనదారులున్నారు.

ఇంటిస్థలం కోసం వినతి

భామిని: జగనన్న కాలనీలో ఇంటి స్థలం కేటాయించాలని తాలాడకు చెందిన చింతాడ కళావతి కోరారు. ఈ మేరకు సోమవారం జరిగిన స్పందనలో తహసీల్దార్ నీలాపు అప్పారావుకు వినతిపత్రం అందించింది. దరఖాస్తును పరిశీలించి 90 రోజుల్లో ఇంటి స్థలం పట్టా మంజూరుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

మహిళలు చైతన్యం కావాలి

- న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్



మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: నేటి సమాజంలో మహిళలు చైతన్యవంతులై మెలగాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్ రాజ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గోపాలపురం గ్రామంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. వరకట్న వేధింపులు, మహిళలు, బాలికల రక్షణ కోసం నిర్దేశించిన చట్టాలపై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైతే ధైర్యంగా ముందడుగు వేసి చాట్టాలను, న్యాయస్థానాలను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిరిపురపు జగదీష్‌కుమార్, ఎస్సై బి.శివప్రసాద్, ఏజీపీ చందక జగదీష్‌కుమార్, మునుస్వామీ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతర మహోత్సవాన్ని జయప్రదం చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఉమా సహిత కైలాసనాథ ఆలయ 40వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే పంచమరాత్రి జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, ఆలయ కమిటీ సభ్యులు కొత్తకోట విష్ణు, మద్ది దొరబాబు, పైడా నాగేశ్వర రావు కోరారు. ఈమేరకు సోమవారం ఆలయం వద్ద జాతర మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు ప్రతీరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామస్తులు జాతరకు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పైడా జగదీష్, నాగరాజు, గుడ్ల హరిప్రసాద్, వైస్ సర్పంచ్ కిశోర్ తదితరులున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



గరుగుబిల్లిలో గుడివాడ చెరువు పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: ఉపాధి పనులు జరిగేచోట సంబంధిత సిబ్బంది నిబంధనలు అమలు చేయకుంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండలంలోని టీకే రాజపురంలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఉదయం 8 గంటల సమయానికి వేతనదారులు, ఉపాధి సిబ్బంది పని ప్రదేశం వద్ద లేకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించాలని, రెండు పూటలా పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అట్టలి, బెజ్జి, గరుగుబిల్లి తదితర గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

కొమరాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ రోజురోజుకు ఎండలు పెరుగుతున్నందున వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే వారి దాహార్తి తీర్చేందుకు తాగునీటి సదుపాయం కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ కృష్ణమూర్తి

వీరఘట్టం: స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీలను ఎంఈఓ పత్రి కృష్ణమూర్తి సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అన్ను వెంకటరావు, కోమటిపల్లి విజయకుమార్, ఎ.సూర్యనారాయణ, సైల రమేష్, కె.గోవిందరావు, దూసి శ్రీబాబు పాల్గొన్నారు.

గోపాలపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



చిన్నారుల బరువు పరిశీలిస్తున్న డాక్టర్ వెన్నెల

పాలకొండ: మండలంలోని గోపాలపురం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యురాలు వెన్నెల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించారు. బీపీ, సుగర్, హెచ్‌బీ తదితర వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి అక్కడి చిన్నారుల బరువు, ఎత్తు పరిశీలించి ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

3 కేంద్రాల్లో గెడ్డతిరువాడ ఎంపీటీసీ ఎన్నికలు



పోలింగ్ కేంద్రాల జాబితాను అతికిస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని గెడ్డతిరువాడ ఎంపీటీసీ సభ్యుడు ఇటీవల మరణించడంతో అక్కడ ఎన్నిక అనివార్యమైంది. ఎన్నిక కోసం గెడ్డతిరువాడ, పిప్పలభద్ర, కుందరతిరువాడలో 3 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ రమేష్ సోమవారం తెలిపారు. పోలింగ్ కేంద్రాల లిస్టును రాజకీయనాయకులు, ఓటర్ల సౌకర్యార్థం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అతికించడం జరిగిందన్నారు. ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే 7వ తేదీన తెలియజేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. 10వ తేదీన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచుతామన్నారు. 3102 ఓటర్లు తమ ఓటును వినియోగించుకోనున్నారు.

లివిరిలో డోలోత్సవ సంసిద్ధత పూజలు

భామిని: వంశధార నదీ తీరంలో ప్రముఖ వైష్ణవాలయంగా గుర్తింపు పొందిన లివిరి గోపీనాథ రాధాకృష్ణ మందిరంలో నేటి నుంచి డోలోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉత్కళ సంప్రదాయంలో డోలోత్సవాల సంసిద్ధత పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమాధికారలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పంచామృతాలతో అభిషేకించి పల్లకిలో తిరువీధి నిర్వహించారు. ఈ నెల 7 నుంచి 15 వరకు డోలోత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు కామదహన కార్యక్రమంతో ఈ ఉత్సవాలు ప్రారంభిస్తారు. ఉత్సవాలకు ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు.



ఉత్సవ విగ్రహాలను పంచామృతాలతో శుద్ధి చేస్తున్న అర్చకులు